క్లుప్తంగా

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



మంటలు ఆర్పడంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సత్తుపల్లిటౌన్: అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా స్థానిక సింగరేణి మహాలక్ష్మి క్యాంప్ ప్రాంగణంలో బుధవారం సత్తుపలి అగ్నిమాపక శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన ఫైర్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగే అగ్ని ప్రమాదాల్లో సీఓటూతో మంటలను ఆర్పే విధానాన్ని ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఉద్యోగులు ఎం.వెంకటేశ్వర్లు, ఎస్కె ఖాజా, బాబురావు, సతీష్, సతీష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



సన్నబియ్యం లబ్ధిదారుల ఇంట్లో భోజనం చేస్తున్న అధికారులు, నాయకులు

చింతకాని: పేద ప్రజల సంక్షేమానికై రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కూరపాటి అనంత రాజు తెలిపారు. చింతకానిలో సన్నబియ్యం లబ్ధిదారుడు తూము భిక్షం నివాసంలో మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు బుధవారం భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి ఆల్తాఫ్, ఎస్సై నాగుల్‌మీరా, ఏఎస్సై లక్ష్మణ్ చౌదరి, ఆర్ఐ రఘు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోర్టు సిబ్బందికి సన్మానం



కోర్టు సిబ్బందిని సన్మానిస్తున్న న్యాయమూర్తి శాంతి లత

మధిర: మధిర కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి ఇతర శాఖలో ఉద్యోగం పొంది బదిలీపై వెళ్తున్న హనీషాను, అకౌంటెంట్ ఆఫీసర్‌గా నియమించబడిన దివ్య దుర్గలను బుధవారం బార్ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. మధిర కోర్టు హాల్‌లో జరిగిన సమావేశంలో న్యాయమూర్తి రాళ్లబండి శాంతి లత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించి ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బోజడ్ల పుల్లారావు, ఏపీపీ భద్రయ్య, న్యాయవాదులు, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మించాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న స్థానికులు

వైరా: వైరా మున్సిపాలిటీ 9వ వార్డులో మధిర రోడ్డు ప్రధాన రహదారి వెంట డ్రెయినేజీ నిర్మించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు రోడ్డు వెంట నిరసన ప్రదర్శన చేశారు. డ్రెయిన్లు లేకుండా రోడ్డు ఎత్తుగా నిర్మించడంతో మురుగు నీరు ఇండ్ల మధ్య చేరి దుర్గంధం వెదజల్లుతుందని, దోమల వ్యాప్తిచెంది జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు. వైరా మున్సిపాలిటీ రింగ్‌రోడ్డు సెంటర్ నుంచి సోమవరం గ్రామం నేషనల్ హైవే రోడ్డు వరకు రూ.12 కోట్లతో నాలుగు లైన్ల బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. గతంలో ఉన్న డ్రెయినేజీ తొలగించడంతో ఆ మురుగు నీరంతా వచ్చి 9వ వార్డులోనే నిలిచి పోతున్నదని తక్షణమే డ్రెయిన్ నిర్మించేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు.

నాగులవంచలో ఉచిత కంటి వైద్యశిబిరం

చింతకాని: మండలంలోని నాగులవంచలో వైరా లయన్స్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి చిరంజీవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా 'ఉపాధి'

- పాత పనులకు స్వస్తి.. కొత్త పనులు గుర్తించని వైనం
- ఉపాధికి దూరమవుతున్న కూలీలు
- మండలంలో 8,136 జాబ్‌కార్డులు



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

బోనకల్: పనిలేని ప్రతి ఒక్కరికీ పని కల్పించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టి చట్టం చేసింది. కానీ నేడు కూలీలకు పనులు కల్పించలేని పరిస్థితుల్లో ఉపాధిహామీ పథకం ప్రశ్నార్థకంగా మారింది. ఒక కుటుంబానికి 100రోజులు పని కల్పించాలని ఉపాధి చట్టంలో పొందుపరిచినప్పటికీ క్రమక్రమంగా ఉపాధిహామీ పథకాన్ని నీరుగారుస్తూ ఆ పథకానికి తూట్లు పొడుస్తున్నారు.

మండలంలోని వివరాలిలా..

మండలంలో 22 గ్రామాల్లో 8136జాబ్ కార్డులు ఉన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2,34,016 పని దినాలు జరిగాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్ష్యాన్ని అధికమించడానికి ప్రభుత్వం కొత్త నిబంధనలు అడ్డంకిగా మారాయి. గతంలో ఉన్న పాత పనులు పంట కాలువలు, వరద కాలువలు, మైనర్ డ్రెయిన్లలో పూడికతీత, చెరువులలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్, ల్యాండ్ లెవలింగ్, పూడికతీతకు సంబంధించిన అన్ని పనులను ప్రభుత్వం తొలిగించింది. కేవలం కొత్త పనులకు మాత్రమే అనుమతి ఉండడంతో కూలీలకు పనిదినాలు కల్పించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్తపనులకు శ్రీకారం చుట్టి పాతపనులకు స్వస్తి పలకడంతో ఉపాధి పనులు దొరికే పరిస్థితి లేదు. గతంలో పాతపనులకు సంబంధించి పూడిన పంటకాలువలు, చెరువులలో పూడికతీత, మైనర్ కాలువలలో పూడిక, జంగిల్ క్లియరెన్స్ పనులు మేజర్‌గా ఉండడం వలన పనులకు ఎంతమంది కూలీలు వచ్చినా పని కల్పించడానికి అవకాశం ఉండేది.

పని కల్పించని ప్రభుత్వం..

గత ఏడాది ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యంలో 95శాతం పూర్తిచేసి జిల్లాలో బోనకల్ మండలం 3వ స్థానంలో నిలిచింది. కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇరిగేషన్ ఆధారిత మండలాలైన ఎర్రుపాలెం, మధిర, బోనకల్, చింతకాని, వైరా, కొణిజర్ల మండలాల్లో పనులు లేకపోవడంతో కూలీలకు పనులు కల్పించలేక ఒకవారం వచ్చిన గ్రూపును మరోవారం పని కల్పించలేకపోతున్నారు. ఇలా ఉపాధిహామీ పథక లక్ష్యం నీరుగారిపోతుంది. దీనికితోడు మండలంలోని లక్ష్మీపురం, రాపల్లి, సీతానగరం, బోనకల్ గ్రామాలకు ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులపై భారం పడుతుంది. దీనికితోడు ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు గత 3 నెలలుగా ప్రభుత్వం జీతాలు కూడా వేయడం లేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పని అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

సరిపడా పనులు లేవు..



కూలీల సంఖ్యకు అనుగుణంగా సరిపడా కొత్తపనులు లేవు. ప్రధానంగా పాతపనులకు అనుమతి లేకపోవడంతో కూలీలకు పూర్తిస్థాయిలో పనులు కల్పించలేకపోతున్నాం. పాత పనులకు అనుమతి వస్తే అందరికి పని కల్పిస్తాం.

– కృష్ణకుమారి, ఏపీఓ, బోనకల్

జీతాలు రాక మూడునెలలు..



గత 3 నెలలుగా జీతాలు రావడంలేదు. కుటుంబ పోషణ భారంగా మారుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమకు జీతాలు పెరుగుతాయని ఆశించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

– కృష్ణవేణి, ఫీల్డ్‌అసిస్టెంట్, చిరునోముల

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

తల్లాడ/ఎర్రుపాలెం: పెండింగ్‌లో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం తల్లాడ ఎంపీడీఓ సురేష్‌బాబుకు, ఎర్రుపాలెం మండల ప్రత్యేకాధికారి అబ్దుల్ లీమ్‌కు వినతిపత్రాలు అందించారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసనలో భాగంగా వినతిపత్రాలు అందించామని సంఘం మండల కమిటీ అధ్యక్షుడు మాతంగి పుల్లారావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ కృష్ణ తెలిపారు. వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, ఇకనైనా చెల్లించకపోతే తమ సంఘం ఆధ్వర్యంలో నిరసనలు చేస్తామని డిమాండ్ చేశారు.



ఎర్రుపాలెం: ప్రత్యేకాధికారి అలీమ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కార్యక్రమంలో సంఘం మహిళా అధ్యక్షురాలు స్వరాజ్యలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టం సవరణకు పోరాడుతాం

సత్తుపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ చట్ట సవరణ కోసం జరిగే ఏ పోరాటానికైనా సిద్ధమని అఖిలపక్షం నాయకులు స్పష్టం చేశారు. సత్తుపల్లిలో బుధవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో వక్తలు మాట్లాడారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇస్తామని తెలిపాయి. చట్టాలకు ఇబ్బంది పెట్టాలనుకుంటే ప్రజాస్వామ్య పార్టీలు ఊరుకోవని హెచ్చరించారు. సమావేశంలో అఖిలపక్షం నాయకులు చెన్నారావు, పాండు, ఆదినారాయణ, సామేలు, జామె మసీద్ అధ్యక్ష, కార్యదర్శులు నాయబ్ రసూల్, కమల్‌పాషా పాల్గొన్నారు.

వీరేశలింగం సేవలు చిరస్మరణీయం

మధిర: తెలుగు నాటక రంగ అభివృద్ధికి కందుకూరి వీరేశలింగం పంతులు అందించిన సేవలు చిరస్మరణీయమని మధిర రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ మాటూరు పేట వారి ఆధ్వర్యంలో స్థానిక శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళా పరిషత్‌ను స్థాపించి ఈ ప్రాంతంలో పౌరాణిక నాటకాలను ప్రదర్శిస్తున్న, కళాకారులను ప్రోత్సహిస్తున్న కళాపరిషత్ వ్యవస్థాపకులు గడ్డం సుబ్బారావును అభినందించారు. కార్యక్రమంలో కళాకారులు రోశయ్య చౌదరి, బాబ్జీ, గురువులు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు



వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

వైరారూరల్: మండలంలోని పూసలపాడులో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను బుధవారం ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏఓ మయాన్ మంజూఖాన్ పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకోని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ వెంపటి కీర్తి, రైతులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

మధిర: మధిరలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ విద్యార్థి వడ్లమూడి వెంకటేశ్వర్లు జిల్లా స్థాయి పవర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల అండర్–17 విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. తొమ్మిదో తరగతి చదువుతున్న ఆయన వెండి పతకం గెలుచుకోగా, హెచ్‌ఎం ఆన్ బేబీ, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. కాగా, వెంకటేశ్వర్లు ఈనెల 19న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు.

పోషకాహారం తీసుకోండి

సత్తుపల్లిరూరల్: తల్లీబిడ్డల ఆరోగ్యానికి పోషకాహారం తప్పని సరిగా తీసుకోవాలని సత్తుపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ కనకదుర్గ అన్నారు. సత్తుపల్లి మండలం జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్వాడ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆహార పోషక ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రజని, అంగన్‌వాడీ టీచర్ ఆశీర్వాదం పాల్గొన్నారు.

రూ.6.80 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం



ఉద్యోగం సాధించిన పూజాశుభమణితో కళాశాల యాజమాన్యం

సత్తుపల్లి: సత్తుపల్లి మదర్‌థెరిస్సా అటనమాస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సీఎస్‌సీ ఫైనలియర్ చదువుతున్న మోరంపూడి పూజాశుభమణి రూ.6.80 లక్షల వార్షిక వేతనంతో యూఎస్ కంపెనీ పోర్ట్‌ల్యాండ్ ఐటీ సొల్యూషన్స్‌లో జావా డెవలపర్‌గా క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికైంది. దీంతో విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికృష్ణ, కరస్పాండెంట్ సాంబశివరావు, చైర్మన్ సత్యనారాయణ, డైరెక్టర్ శ్రీనివాసరావు, డీన్ జాకీర్‌హుస్సేన్, కోఆర్డినేటర్ రామచంద్రరావు, ప్లేస్‌మెంట్ అధికారి రాఘవరాజు అభినందించారు.

ఆంబోతుకు అంత్యక్రియలు


పెనుబల్లి: మండలంలోని తాళ్లపెంట గ్రామంలోని ఆంబోతు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. దీంతో గ్రామస్తులు ఆ ఆంబోతు మృత దేహాన్ని ట్రాక్టర్‌పై మేళతాళాలతో వీధుల్లో ఊరేగించగా.. మహిళలు ఇండ్ల ముందు నీళ్లు ఆరబోస్తూ ఫలహారాలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కిరణ్‌రెడ్డి, సీతారాములు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని చెన్నూరులో విద్యుదాఘాతం కారణంగా పాడిగేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన ఏలూరి వెంకట్రామయ్య తన గేదెలను బుధవారం ఉదయం పొలాల్లో మేతకు వదిలాడు. అక్కడ విద్యుత్ స్తంభం విరగడమే కాక తీగలు వేలాడుతుండటంతో వాటిని తాకిన ఓ గేదె మృతి చెందింది. అలాగే, మరో ఐదే గొర్రెలు కూడా మృతి చెందాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే రూ.లక్ష విలువైన గేదె మృతి చెందినందున తనను ఆదుకోవాలని వెంకట్రామయ్య కోరాడు. కాగా, విద్యుత్‌శాఖ అధికారులు ఘటనా స్థలంలో పరిశీలించగా, కల్లూరు పోలీసులకు రైతు ఫిర్యాదు చేశాడు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

చింతకాని: మండలంలోని చింతకానిలో లబ్ధిదారులకు బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన తలారి లక్ష్మీనారాయణ, వడ్డెబోయిన నాగమణి, గడ్డం నాగమణిలకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.95 వేల విలువైన చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భాస్కర్, నాగార్జున్, మజీద్, ప్రగతి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న వెంకటేశ్వర్లు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



వేంసూరు: అడసర్లపాడులో ప్రారంభిస్తున్న ఏఎంసీ డైరెక్టర్ సత్యనారాయణ

వేంసూరు/ఎర్రుపాలెం/వైరారూరల్: మండలంలోని అడసర్లపాడులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సత్తుపల్లి ఏఎంసీ డైరెక్టర్ రావి సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. ఎర్రుపాలెంల మండలంలోని మాము నూరు, బనిగండ్లపాడు, జమలాపురం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు, కాంగ్రెస్ మండలాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. అదే విధంగా వైరారూరల్ మండలంలోని ముసలిమడుగు, గన్నవరం గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ కేవీ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. మార్కెటింగ్ జిల్లా అధికారి అలీమ్, ఎంపీడీఓ సురేందర్, ఐకేపీ ఏపీఎం హరినారాయణ, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రేమలత, బుచ్చాలు, సాంబశివరెడ్డి, సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న డిపో మేనేజర్ శంకర్‌రావు

మధిర: ప్రతిరోజు విద్యార్థులను ఎంప్లాయిస్ కాలనీ నుంచి జిల్లా పరిషత్ హరిజనవాడ ఉన్నత పాఠశాల వరకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించిన మధిర ఆర్టీసీ అధికారుల సేవలు అభినందనీయమని పాఠశాల హెచ్‌ఎం విజయశ్రీ తెలిపారు. బుధవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి డిపో మేనేజర్ శంకర్‌రావు, మెకానికల్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గాదె రామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం డిపో మేనేజర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కృష్ణవేణి, వంగవీటి రాజశేఖర్, బీసీ హాస్టల్ వార్డెన్ శ్రీనివాసరావు, ఎస్టీ హాస్టల్ వార్డెన్ బానోత్ సునీత తదితరులు పాల్గొన్నారు.

తొలి వేతనం అమ్మవారికి మొక్కు



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందిస్తున్న పావని

కారేపల్లి: తొలి వేతనంగా వచ్చిన రూ.20వేలను శ్రీగురువమ్మతల్లి ఆలయంలో సమర్పించిన ఓ యువతి మొక్కు తీర్చుకుంది. మండలంలోని పేరుపల్లికి చెందిన పప్పుల బాలస్వామి–రాములమ్మ కుమార్తె పావని ఇటీవల తమిళనాడులో పోస్టల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించింది. ఈ మేరకు స్వగ్రామంలో అమ్మవారి జాతర సందర్భంగా తన తొలి వేతనాన్ని ఆలయానికి సమర్పించగా పలువురు అభినందించారు. ఆలయ చైర్మన్ కంచర్ల శ్రీనివాసరెడ్డి, సభ్యులు నాగేశ్వరరావు, సత్యనారాయణ, కోటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, చంద్రయ్య, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అండగా మహేష్‌బాబు ఫౌండేషన్



స్కాలర్‌షిప్ పత్రాలు అందిస్తున్న విద్యార్థులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లిలో తల్లిదండ్రులను కోల్పోయిన నిరుపేద విద్యార్థులు చల్లారి ప్రదీప్‌కుమార్, శ్రీశరణ్యలు సూపర్‌స్టార్ కృష్ణ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఆ చిన్నారుల చదువు నిమిత్తం మహేష్‌బాబు ఫౌండేషన్ నిర్వాహకురాలు సినీనటి నమ్రత రూ.30వేలను స్థానిక విశ్వశాంతి విద్యాలయానికి చెల్లించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మహేష్‌బాబు, నమ్రతలకు అభిమాన సంఘ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారుల తల్లి గుండెజబ్బుతో, తండ్రి మెదడువాపుతో చనిపోగా.. ఈవిషయాన్ని సూపర్‌స్టార్ అభిమాన సంఘం బాధ్యులు నమ్రత దృష్టికి తీసుకెళ్లగా ఆమె ఫౌండేషన్ ద్వారా ఆ నగదును ఫీజుగా చెల్లించారు. కార్యక్రమంలో సృజన సాహితీ సంస్థ నిర్వాహకులు జి.రామకృష్ణ, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం



విద్యార్థి కుటుంబానికి నగదు అందిస్తున్న సప్తపది లయన్స్ క్లబ్ సభ్యులు

పెనుబల్లి: వీయంబంజర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వంశీని లారీ ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలపాలై హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ కుటుంబానికి తమవంతు సాయంగా సప్తపది లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.20 వేలు మృతుడు వంశీ కుటుంబానికి అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు శ్రీదరాల సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ లయన్ ఎస్కె అబ్దుల్ సలాం, సెక్రటరీ లయన్ మిట్టపల్లి శ్రీదర్, ట్రెజరర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు

తల్లాడ: సమగ్ర బాలల పరిరక్షణ పథకం ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలస్థాయి బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేకాధికారి జి.శివప్రసాద్ సమక్షంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ ప్రత్యేకాధికారి జి.శివప్రసాద్, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఏసీడీపీఓ నవ్యశ్రీ, తహసీల్దార్ సురేష్, ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, వైద్యాధికారి రత్నమనోహర్, ఏపీఎం ఆశారాణి, డి.నిరోషా, హిమసిందులను నియమించారు.

ఆడపిల్లల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

మధిర నియోజకవర్గంలో..



ముదిగొండ: బాణాపురంలో బాలిక తల్లిదండ్రులను సన్మానిస్తున్న అధికారులు

చింతకాని/ ముదిగొండ/ ఎర్రుపాలెం/ బోనకల్: ఆడపిల్లలను ప్రతిఒక్కరూ బాధ్యతగా సంరక్షించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత పేర్కొన్నారు. 'మా పాప – మా ఇంటి మణిదీపం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాఘవాపురం గ్రామంలో జన్మించిన బాలిక తల్లిదండ్రులు మేడ నాగరాజు, గౌతమి లను బుధవారం డీపీఓ సన్మానించి.. సన్మాన పత్రాన్ని అందించారు. అనంతరం సన్నబియ్యం లబ్ధిదారుడైన నాగరాజు ఇంట్లో భోజనం చేశారు. అదే విధంగా ముదిగొండలోని బాణాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలిక తల్లిదండ్రులు మరియమ్మ, లెనిన్‌కుమార్‌లకు అధికారులు స్వీటుబాక్సు, సర్టిఫికెట్ అందజేసి, సన్మానించారు. ఎర్రుపాలెం మండలంలోని రాజులదేవరపాడు గ్రామంలో ఇటీవల దుద్దుకూరు అనీల్, జ్యోతిలకు జన్మించిన బాలిక భవ్యశ్రీ ఇంటిని బుధవారం మండల ప్రత్యేకాధికారి అబ్దుల్ అమీర్, ఎంపీడీఓ సురేందర్, ఐసీడీసీఎస్ ఏసీడీపీఓ కృష్ణశ్రీ, వైద్యాధికారి ప్రశాంత్ సందర్శించి.. పాప తల్లిదండ్రులకు స్వీట్లు, సర్టిఫికెట్ అందించి సన్మానించారు. అనంతరం గంటుపల్లి గోపవరం, రాజులదేవరపాడు గ్రామాల్లో పోషకాహార పక్షోత్సవాలను నిర్వహించి.. పోషకాహార ప్రతిజ్ఞ చేయించారు. అదే విధంగా బోనకల్ మండలంలోని రాయన్నపేటలో తోటపల్లి స్వర్ణలత – మహేష్ దంపతులకు రెండో కుమార్తె జన్మించడంతో దంపతులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, సుజాత శాలువా కప్పి సన్మానించారు. అనంతరం పోషణ పక్షోత్సవాల్లో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాలల్లో ఐసీడీఎస్ ఏసీడీపీఓ శివకుమారి, మండల పంచాయతీ అధికారులు పర్వీన్ ఖైసర్, విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, పద్మావతి, సరిత, సునీత, మధులత, సీడీపీఓ కమలప్రియ, ఏసీడీపీఓ శారదశాంతి, ఎంపీడీఓలు శ్రీధర్‌స్వామి, రమాదేవి, వైద్యాధికారులు స్రవంతి, వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఉమారాణి, గోపమ్మ, రాజకుమారి, ఏఎన్‌ఎం పద్మావతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్, అంగన్‌వాడీ టీచర్ కనకమ్మ, ఆశా కార్యకర్త పద్మ, తహసీల్దార్ పున్నం చందర్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి నియోజకవర్గంలో..



తల్లాడ: అన్నారుగూడెంలో..

సత్తుపల్లిటౌన్/తల్లాడ/కల్లూరు: సత్తుపల్లి మున్సిపాలిటీలోని వెంగళరావునగర్‌లో బుధవారం మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా ఆడపిల్ల తల్లిదండ్రులు, నాన్నమ్మ, తాతయ్యలను జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ అధికారి, స్పెషలాఫీసర్ సునీల్‌రెడ్డి సన్మానించి స్వీట్లు, పండ్లు అందించారు. అదే విధంగా తల్లాడ మండలంలోని అన్నారుగూడెంలో ఆడపిల్లకు జన్మనిచ్చిన దీప్తి ఇంటికి మండల ప్రత్యేకాధికారి జి.శివప్రసాద్, ఎంపీడీఓ ఎ.సురేష్‌బాబు, ఏసీడీపీఓ జి.నవ్యశ్రీ, సూపర్‌వైజర్ కె.సత్యావతి వెళ్లి స్వీట్లు, పండ్లు, ప్రశంసాపత్రాన్ని అందించి సత్కరించారు. కల్లూరు మండలంలోని శ్రీరామపురంలో బాలింగ మేరుగు పూజిత, నాగేంద్రబాబులకు ఆడపిల్ల పుట్టడంతో వారిని కల్లూరు మండల స్పెషల్ ఆఫీసర్ సునీత సన్మానించి, ప్రశంసాపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓ నందిశెట్టి నాగేశ్వరరావు, సీడీపీఓ కనకదుర్గ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రజని, భవాని, అంగన్‌వాడీ టీచర్లు లిల్లి, ప్రసన్న, రాణి, నాగమణి, విజయమ్మ, ఉషారాణి, ఎఎన్‌ఎం విజయలక్ష్మి, రాంబాయి, గ్రామ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు, నాగరత్నం, వెంకటనర్సమ్మ, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

వైరా నియోజకవర్గంలో..



కొణిజర్ల: పెద్దగోపతిలో సంధ్య, కిరణ్ దంపతులను సత్కరిస్తున్న అధికారులు

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతి గ్రామానికి చెందిన గోవింద సంధ్యారాణి, కిరణ్ దంపతులకు అడ బిడ్డ పుట్టగా ఆ దంపతులను ఐసీడీఎస్ ఏసీడీపీఓ వాసిరెడ్డి ఉషారాణి సత్కరించి ప్రశాంసా పత్రంతో అభినందించారు. ఈ సందర్భంగా తాత–అమ్మమ్మ బొడ్డు వెంకటేశ్వర్లు, రేణుకలను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రోజారాణి, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, స్పెషల్ ఆఫీసర్ రాజేశ్వరి, జేపీఎస్ శివ తదితరులు పాల్గొన్నారు.